# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత  సంచిక నుంచీ తరువాయి)

## 19

**ముద్గల్ గ్రామానికి తగిలిన గాయాల పచ్చి ఇంకా ఆరలేదు.** ఇంతలోనే మరో దుర్వార్త. ముద్గల్ గ్రామం మొత్తం వేదరాయశర్మ అంత్యక్రియలకి వచ్చారు. ఈ సారి సైన్యాన్ని ఎవరూ లెక్క చేయలేదు. మొత్తం గ్రామం కలిసిగట్టుగా ఉంటేనే కోల్పోయిన మానసిక స్థైర్యం తిరిగొస్తుందన్న నిర్ణయానికొచ్చారు. సైన్యం దాడి చేస్తే చూసుకోవచ్చులే అనుకున్నారు.

వేదరాయశర్మని సైనికులే చంపేసారనీ ప్రతీ ఒక్కరూ నరేంద్రగజపతిని దుమ్మెత్తి పోసారు. పరిస్థితులు చల్లరాక విజయనగరం వెళ్ళి మహారాజుకి జరిగినదంతా విన్నవించాలనీ అనుకున్నారు. వేదరాయశర్మ మరణం ముద్గల్ గ్రామానికి తెలీని మొండి ధైర్యాన్నిచ్చింది. జరిగేదేదో జరగక మానదు. భయంతో ఎన్నాళ్ళు బ్రతుకుతాం? అన్న అభిప్రాయానికి అందరూ వచ్చారు. సైనికులకి ఇహ భయపడకూడదని వారికెవ్వరూ ఏ రకమైన సహాయం చెయ్యకూడదని నిర్ణయించుకున్నారు.   సైనికులకి విషయం తెలిసి ఎవరు చంపారని కనిపించిన అందర్నీ ప్రశ్నించారు. అది విని అందరూ వాళ్ళని ఛీత్కరించుకొని వెళిపోయారు తప్ప ఎవరూ వారికి సమాధానం చెప్పలేదు.

వేదరాయశర్మ అంత్యక్రియలు ముగిసాయి. శిష్యులందరూ వచ్చారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న వేదరాయశర్మ భార్యని ప్రభా, మిగతా శిష్యులూ ఓదార్చారు. అందరూ రేవన్న గురించి తలచుకున్నారు. రేవన్న తల్లీ, తండ్రి వస్తే అదే ప్రశ్నించారు. పనిమీద విజయనగరం వద్ద బంధువుల దగ్గరికెళ్ళాడనీ వాళ్ళు చెప్పారుతప్ప ఎప్పుడెళ్ళిందీ అన్న విషయాలు ప్రస్తావనకే తీసుకురాలేదు. అందరికీ నేహాల ఏమయ్యిందన్న సంశయం కలిగింది. ఎక్కడికి పారిపోయింది? ఏ వూళ్ళో తలదాచుకుందో కదాని అందరూ చెవులు కొరుక్కున్నారు. రేవన్నా, నేహాల పేర్లు ఎవరూ పైకి అనే సాహసం చెయ్యలేదు. ఏం మాట్లాడితే ఏ అనర్థాలొస్తాయోనని మిన్నకున్నారు.

వేదరాయశర్మ హత్య విషయం చుట్టుపక్కల గ్రామాలకీ పాకింది. సైనికులెవరికీ గ్రామంలో సహాయం అందకపోయే సరికి అక్కడున్న సైనికాధికారి వేదరాయశర్మ మరణాన్ని దేవరాయలకి విన్నవించాలని నిశ్చయించుకున్నాడు. తను తిరిగొచ్చే వరకూ ఎవరెన్ని విధాల ప్రేరేపించినా సంయమనంతో మెలగమని సైనికులకి మరీ మరీ చెప్పాడు. వెళుతూ, వెళుతూ వేదరాయశర్మ భార్యని పరామర్శించీ, తమ సైనికులెవరూ ఈ అఘాయిత్యానికి పాలుపడలేదనీ, తనని నమ్మమనీ ప్రాధేయపడ్డాడు. విజయనగరం వెళ్ళగానే సైనికుల్ని ముద్గల్ గ్రామం నుండి వెనక్కి వచ్చేలా చేస్తాననీ ప్రమాణం చేసి మరీ బయల్దేరాడు.

వేదరాయశర్మకి పిల్లల్లేని కారణంగా తెలుసున్న బంధువులే కర్మకాండ నిర్వహిస్తున్నారు. శిష్యులందరూ అక్కడే ఉండి కావలసిన సహాయం చేస్తున్నారు.

సైనికాధికారి విజయనగరం వెళ్ళి దేవరాయలకి జరిగింది చెబితే సైన్యం వెనక్కి వెళ్ళే అవకాశముందని గట్టిగా నమ్మాడు శంభుడు. ఎలాగయినా ముద్గల్ ప్రజలకి శాంతియుత జీవనం ప్రసాదించమని  సైనికాధికారిని శతవిధాలా ప్రాధేయపడ్డాడు. తన ప్రయత్నం తను చేస్తాననీ,  తరువాత మహారాజు ఇష్టమనీ  సైనికాధికారి చెప్పి శలవు తీసుకున్నాడు.

వేదరాయశర్మ పోయాడన్న వార్త ఎలాగైనా రేవన్నకి చెప్పాలని శంభుడు అనుకున్నాడు. రేవన్న రాయచూరులో ఉన్నాడని తెలుసు కానీ, ఎక్కడున్నదీ శంభుడికి తెలీదు. ఒకవేళ తను రేవన్నని కలవడానికి ప్రయత్నిస్తే నేహలా వాళ్ళూ రాజ సైనికులకి పట్టుబడే అవకాశముందని భావించి మరలా ప్రయత్నాలు చెయ్యలేదు.

కానీ సైనికాధికారి విజయనగరం వెళ్ళడంతో పరిస్థితి చక్కబడుతుందన్న నమ్మకం కలిగింది ముద్గల్ శంభుడికి. రాయచూరు వెళ్ళాలా వద్దా అన్న మీమాంసతో తటపటాయించాడు. కానీ ఇక్కడి విషయాలు చెప్పడమే మంచిదన్న నిర్ణయానికొచ్చి రేవన్నా వాళ్ళింటికి వెళ్ళాడు.

రేవన్న రాయచూరులో ఉంటాడని తెలుసు కానీ, ఎక్కడున్నదీ తెలీదు. తనూ ఎప్పుడూ అడగలేదు. వాళ్ళూ చెప్పలేదు. రేవన్న ఇంటికెళ్ళే సరికి రేవన్న తండ్రి అక్కడే ఉన్నాడు. కలవగానే ముద్గల్ పరిస్థితి గురించి మాటలొచ్చాయి. సుమారు ఇరవై ఏళ్ళ క్రితం, అంటే రేవన్న తండ్రి చిన్నతనంలో ముద్గల్ కోటని ముస్లిం రాజులు ఆక్రమించుకుందామని పలుమార్లు యుద్ధానికొచ్చారనీ, ఆ సమయంలో ముద్గల్ వాసులు ఎంత భయపడ్డారో చెప్పాడు. అప్పుడే ముస్లిం సుల్తానులు ముద్గల్ కోటని నేలమట్టం చేసారనీ చెప్పాడు. దేవరాయలు ముందు రెండవ హరిహరరాయలు పాలించేవాడనీ అతని హయాంలోనే ఈ యుద్ధాలు తగ్గి ప్రశాంత వాతావరణం వచ్చిందన్న విషయం చెప్పాడు. ఇన్నేళ్ళ తరువాత మరలా అటువంటి భయభ్రాంతులు గ్రామస్తుల్లో చూసాననీ రేవన్న తండ్రి వాపోయాడు. కొంత సేపయ్యాక ఇంటికి బయల్దేరడానికి సంసిద్ధుడవుతూ శంభుడు రేవన్న తండ్రిని ఇలా ప్రశ్నించాడు.

"అయ్యా! ఈ పరిస్థితుల్లో రేవన్న ఉంటే బావుండేది. రేవన్న మాటకారి. అన్ని వ్యవహారాలూ ఓపిగ్గా చక్కబెట్టగలడు. నేను రేపు రాయచూరు పని మీద వెళుతున్నాను. రేవన్న రాయచూరు దగ్గరే ఉంటున్నానని చెప్పాడు. మీకా వివరాలు తెలుసా?"

"నిజంగా తెలీదు నాయనా! హరీంద్ర కుటుంబానికి అండగా ఉంటాననే చెప్పాడు తప్ప ఇంకే వివరాలూ ఇవ్వలేదు. మేమూ అడగలేదు. పని కుదిరితే వాడే వస్తాడు," అంటూ రేవన్న తండ్రి శంభుడి ప్రశ్నకి జవాబిచ్చాడు.

"ప్రస్తుత పరిస్థితులు చూస్తూంటే ఎప్పుడేం ముంచుకొస్తూందో తెలీడం లేదు. దీనికంతటికీ ఒకవిధంగా వేదరాయశర్మ గారే కారణం. మరోపక్క మహారాజు మరలా ఏం చేస్తాడోనని అందరం భయపడి చస్తున్నాం. పక్క గ్రామాల వాళ్ళు కూడా మన వైపు రావడానికే భయపడుతున్నారు." శంభుడు నిట్టూర్చాడు.

"ఇందులో వేదరాయశర్మ తప్పుందనీ అనుకోను. విధి వైపరీత్యమంటె ఇదే! ఎంతో ప్రతిభావంతురాలూ, సుగుణవతి, సౌందర్యవతీ అయిన తన శిష్యురాలు రాణి అవుతే బావుంటుందని ఆశించాడు. అందులో ఆయన తప్పేవిటి? అలా చూస్తే నేహలదీ తప్పు లేదు. ఆమె బ్రతుకు ఆమెకు నచ్చినట్లుగా ఉండాలనుకుంది. అందుకే మహారాజుని కాదంది. తప్పేదయినా వుంటే అది మహారాజుదే! ముగ్గురు మహరాణులున్నా, నాలుగో రాణికోసం ఎగబడడమే ఈ అనర్థాలకి కారణం.."

"ఏమో మహారాజు తలుచుకుంటే ఏవైనా చెయ్యగలడు. నేహల ఆచూకీ తెలిసే వరకూ ఈ గ్రామాన్ని వదిలి పెట్టడన్న భయంగా ఉంది. ఇప్పటికే నూటికొపైగా సైనికులు తిష్టవేసారు." శంభుడి ఆవేదనా, భయమూ అర్థమయ్యింది రేవన్న తండ్రికి. దిగులు చెందనవసరం లేదని అతనికి ధైర్యం చెప్పాడు.

"నువ్వు చెప్పిందీ ఒక రకంగా నిజమే! చూస్తూంటే ఇటువంటి పరిస్థితుల్లో నెహల రాయచూరు దగ్గర ఉండడమే సబబనిపిస్తోంది. దేవరాయలు ముద్గల్లు వస్తాడు కానీ వివాదాస్పదమయిన రాయచూరు సమీపానిక్కూడా రాడు. వాళ్ళు అక్కడుండడమే క్షేమం," రేవన్న తండ్రి అన్నాడు.

"ఇప్పటికీ నాకర్థంకాదు. రాయచూరు అటు గుల్బర్గా సుల్తానులకీ చెందదు. ఇటు విజయనగరంలోకీ రాదు. అయినా అక్కడి ప్రజలు అటూ ఇటూ వెళ్ళొస్తూ ఉంటారు." సందేహం వ్యక్త పరిచాడు శంభుడు.

రేవన్న తండ్రి రాయచూరు ఎందుకు వివాదాస్పదమయ్యిందో చెప్పడం మొదలు పెట్టాడు.

"గతంలో దేవరాయల ముందున్న రాజు హరిహరరాయలకి బుక్కరాయలనే కొడుకుండేవాడు. రెండవ హరిహరరాయలకి సైనికాధికారిగా రాజ్యా పరిరక్షణంతా చూసేవాడు. దేవరాయలముందు విజయనగరాన్ని రెండేళ్ళు మించి పాలించలేదు.

సింహాసనం ఎక్కకు ముందొకసారి తండ్రి ప్రోద్భలంతో రాయచూరు ఆక్రమించుకోడానికి యుద్ధానికి వెళ్ళాడు. అప్పట్లో విజయనగర ఉత్తరభాగానున్న రాయచూరూ, ముద్గల్ సంస్థానాలు స్వంత ప్రతిపత్తితో నడిచినా బహమనీ రాజులతోనే స్నేహంగా ఉండేవి. బుక్కరాయలకిది నచ్చలేదు. ఎలాగయినా వాళ్ళని దెబ్బకొడితే, తద్వారా గుల్బర్గా సుల్తానులని దెబ్బకొట్టచ్చన్న ఉద్దేశ్యంతో ఆదోని సంస్థానం సహాయంతో రాయచూరుకి మూడు వేలమంది పైగా సైన్యంతో చుట్టుముట్టాడు. ఇది తెలిసి రాయచూరు సంస్థానాధీశుడు గుల్బర్గా రాజుల్ని ఆశ్రయించాడు. అప్పటికి ఫిరోజ్ షా గద్దెనెక్కిన కొత్త. అతనూ తన సైన్యంతో కృష్ణా నదీ తీరం వరకూ వచ్చాడు. వేసవి కాలమయినా అనుకోకుండా వచ్చిన ఎడతెరిపిలేని వానల వల్ల అక్కడే ఉండి పోయాడు. వానలు కాస్తా వరదలయ్యాయి. చూస్తూండగా ఫిరోజుషా సైన్యంలో కొంతమంది వరదల్లో కొట్టుకు పోయారట. అది చూసి ఏం చెయ్యాలో పాలుపోని పరిస్థితుల్లో అతని ఉపదండనాయకుడొకడు సౌరోజ్ అనే అతను హరిహరరాయల్నీ అతని కొడుకు బుక్కరాయల్నీ హతమారుస్తాననీ చెప్పి, కొంతమంది స్నేహితులతో అంత వరదల్లోనూ కృష్ణా నది దాటి రాయచూరు వైపుకొచ్చాడు. అప్పటికే రాయచూరుని ఆక్రమించుకునామన్న - ఆనందంలో బుక్కరాయలు అక్కడున్న నర్తకీమణులతో ఆడి పాడుతూ వినోదాల్లో మునిగున్నాడు. బుక్కరాయలకొక కొడుకుండేవాడు. పేరు నాకు సరిగా తెలీదు. అతను కొంతమంది నాట్యకత్తెలతో విందు విలాసాలు చేయడానికి కొంతమందిని పురమాయించాడు. అది తెలిసి సౌరోజూ అతని అనుచరులూ ఒక నాట్యకత్తెని బంగారమూ, ధనంతో లోబరుచుకొని, విందులో డప్పు వాయించేవాళ్ళుగా వెళ్ళారు. ఆ ప్రదర్శన చూసి మెచ్చుకున్న బుక్కరాయలు కొడుకు, వాళ్ళని సత్కరిద్దామని దగ్గరకు పిలిచినప్పుడు సౌరోజీ, అనుచరులూ అతనిపై దాడి చేసి చంపేసారు.

కొడుకు మరణ వార్త విని భయంతోనూ, బాధతోనూ బుక్కరాయలు విజయనగరం వెనక్కి వెళిపోయాడు. ఈలోగా హరిహరరాయలు విషయం తెలుసుకొని ఫిరోజు షాతో సంధి ఒడంబడిక చేసుకున్నాడు. అందులో భాగంగా రాయచూరు ఇద్దరికీ ఒక సరిహద్దుగా మారిపోయింది. రాయచూరు ఎవరికీ చెందకుండా పోయింది. ముద్గల్లు మాత్రం విజయనగర ఆధీనంలోకే తిరిగొచ్చింది. ఈ రాయచూరు వ్యవహారం ఇప్పటిది కాదు. తరతరాలుగా సాగుతున్న పోరే! బుక్కరాయలు తరువాత దాదాపు పదేళ్ళు ప్రశాంతంగా ఉందనుకునే సరికి మరలా ఫిరోజుషా వాళ్ళూ రాయచూరు తమదంటూ యుద్ధం చేసే సరికి క్రితం ఏడాది దేవరాయలు వాళ్ళని తరిమికొట్టాడు. ఇది నీకూ తెలుసు కదా?" అంటూ సవివరంగా చెప్పాడు.

"చిన్న సంఘటన జరిగితేనే ముద్గల్లు కకావికలయిపోయి ప్రజలు భయంతో ఉన్నారు. అటువంటిది ఎప్పుడు యుద్ధం వస్తుందో తెలీని రాయచూరు వాసుల ధైర్యాన్ని మెచ్చుకోవాలి. మీరు చెప్పింది వింటూంటే నేహలా వాళ్ళు అక్కడ ఉండడమే మంచిదిగా తోస్తోంది. నాకు రాయచూరులో అగుపడితే ముద్గల్ ఛాయలక్కూడా రావద్దని చెబుతాను. " అంటూ శంభుడు శలవు తీసుకున్నాడు.

రేవన్న తండ్రికీ తెలిసుండకపోవచ్చుననీ అనుకున్నాడు. రాయచూరు వెళ్ళి అక్కడే అడిగి తెలుసుకుందామని అనుకున్నాడు. వాకబు చేస్తే మాత్రం చూకీ పట్టలేనా అనుకొని ఇంటి ముఖం పట్టాడు. మర్నాడు రాయచూరు వెళ్ళడానికి సంసిద్ధుడయ్యాడు.

000000000000000

ఫిరోజ్‌షానీ గిసుదరాజునీ ఫిరోజాబాదులో ఉండమని తను సైన్యాన్ని అప్రమత్తం చేయడానికి గుల్బర్గా వెళ్ళొస్తాననీ చెప్పి బయల్దేరాడు అహ్మద్‌ఖాన్. గుల్బర్గాలో రహస్యంగా సైన్యాన్ని సమావేశ పరిచాడు.

ఈ సారి దేవరాయలు యుద్ధానికి ప్రేరేపించినా, లేకపోయినా వారు మాత్రం యుద్ధం చేసే తీరాలని సైనికులందరికీ ఉద్‌బోధ చేశాడు. పక్కలో బల్లెం పెట్టుకొని నిద్రపోవడం అసాధ్యమనీ, సైనికులందరికీ పొంచి ఉన్న ముప్పుని వివరించాడు. రహస్యంగా సైనికాధికారులందరితోనూ యుద్ధ తంత్రం గురించి ఆలోచించాడు. రాయచూరు మీదుగా దండెత్తితే దేవరాయలకి సులభంగా తెలిసిపోతుందనీ ఈ సారి ముప్పేటా దాడి చెయ్యాలని తన మదిలో మాట చెప్పాడు.

"ఏం చేస్తారో ఎలా చేస్తారో తెలీదు. ఈ సారి యుద్ధంలో మాత్రం మనం ఎట్టి పరిస్థితుల్లోనూ నెగ్గి తీరాలి. మనం పకడ్బందీగా పథకం వెయ్యాలి. వేగుల్నీ అప్రమత్తం చెయ్యండి," అంటూ ఆదేశించాడు.

"మీరు చెప్పింది ఒకరకంగా సబబుగానే తోస్తోంది. రాయచూరు మీదుగా వెళితే దేవరాయలకి ముందుగా తెలిసే ప్రమాదముంది. మన సైన్యాన్ని మూడు నాలుగు దళాలుగా చేద్దాం. ఒక దళం షాహబాద్ మీదుగా షోరాపూరు, లింగసుగూరు వైపు వెళుతుంది. యుద్ధంలో ఆరితేరిన ప్రముఖుల్ని ఇటువైపుగా పంపుదాం. మరో దళం రాయచూరు వైపు వెళుతుంది. ఈ దళంలో కూడా పెద్దదిగానే ఉండాలి. ఎందుకంటే రాయచూరులో విజయనగర వాసుల మద్దత్తుదారులు చాలామందే ఉన్నారు. యుద్ధం అంటే వాళ్ళూ ఎదురుతిరగే అవకాశముంది. పైగా రాయచూరునుండి సింధనూరుకి మంచి రహదారుంది. విజయనగర సైన్యం సులభంగా రాయచూరు చేరే అవకాశముంది. కాబట్టి మన సైన్యం రహదారిని ఎలాగైనా మూసే ప్రయత్నం చేస్తే విజయనగర సైన్యాన్ని అడ్డుకోవచ్చు. ఈ లోగా మరో దళం దేవదుర్గం మీదుగా అటువైపునుండి కవితల్ మీదుగా ముద్గల్ చేరుకోవాలి. మరో దళం లింగసుగూరు మీదుగా ముద్గల్ చేరుకుంటే దాదాపుగా మనం విజయనగరంలో ప్రవేశించినట్లే. ఈలోగా మిగతా సైన్యాన్నీ సమాయత్తం చేసి అక్కడకి వచ్చేలా చూసుకుంటే మంచిది. మనకున్న వేగులందర్నీ అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు కబురందేలా చూడాలి. ఇలా చేస్తే మనం విజయనగరాన్ని ఆక్రమించుకున్నా లేకపోయినా కనీసం రాయచూరు, ముద్గల్,లింగసుగూర్ వంటి వూళ్ళు మన చేత చిక్కినట్లే," అహ్మద్ ఖాన్ అంతరంగిక సలహాదారుడూ, సైన్యాధికారి ఫరూక్ తన పథకం సుల్తాన్ ముందుంచాడు.

అహ్మద్‌ఖాన్‌కి ఫరూక్ చెప్పింది నచ్చింది. అవున్నట్లుగా తలూపాడు.

" నేనూ, నువ్వూ మనం రాయచూరు మీదుగా వెళదాం. సుల్తాన్ ఫిరోజ్ షాని ఈ యుద్ధానికి దూరంగా ఉంచడమే మనకి మంచిది. వీలయినంత వరకూ సైన్యాధికారుల చేతనే ఈ తిరుగుబాటు చేయించడం మంచిదనిపిస్తోంది. సుల్తాన్ గుల్బర్గాలో ఉండడం రాజ్యానికీ మంచిది. మన వేగులందర్నీ రమ్మన మని కబురంపించాను. రాయచూరులో మసూం అనే ఒకతనున్నాడు. అతనే దేవరాయలు యుద్ధానికి ప్రయత్నాలు చేస్తున్నట్లుగా వార్త తీసుకొచ్చాడు. ముద్గల్లో సైన్యం ఉన్నట్లు వేరే వేగులు కూడా నిర్థారించారు. మసూమ్ని రమ్మనమని కబురుపంపాను. అతను ఏ క్షణమయినా రావచ్చు. అలాగే మీరూ మీ ప్రయత్నాలలో ఉండండి. సైన్యానికి కావల్సిన ఆ-హారమూ, సదుపాయాలు కూడా మీరే చూడాలి," అంటూ తన మనసులో ఉన్నది చెప్పాడు.

ఫిరోజాబాదు కోట గురించి దేవరాయలకి తెలిసే ఉంటుంది. అందుకే సమయం చూసి దెబ్బకొడుతున్నాడని అనుకున్నాడు. కానీ ఒకరకంగా చూస్తే ఇదే మంచి అవకాశం. నెగ్గితే రాయచూరు తమ ధీనంలోకి వస్తుంది. లేదా రాయచూరు దాటి రాకుండా సైన్యాన్ని అక్కడే మోహరిస్తే దేవరాయలు ముందుకు రాడు. ఈసారి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ దేవరాయలపై విజయం సాధించడానికే కృతనిశ్చయింతో ఉన్నాడు అహ్మద్‌ఖాన్.

కొంత సేపటికి మసూం వచ్చాడు. సైన్యమింకా అక్కడే ముద్గల్లోనే ఉందనీ చెప్పాడు.

"మసూం, నువ్వు నీ అనుచరులందరినీ అప్రమత్తం చెయ్యి. ఒక్క రాయచూరులోనే కాదు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా వేగుల్ని నియమించు. దీనికి ధనమెంతయినా వెచ్చిద్దాం. నాకిప్పటికీ అర్థంకాని విషయం. దేవరాయలు ఏడాది తిరక్కుండా మరలా ఎందుకు యుద్ధానికి వస్తున్నాడో అర్థం కావడం లేదు. యుద్ధం అంటే సామాన్యమయిన విషయం కాదు. ఎన్నో చూసుకోవాలి. ఎంతో మందిని సమాయత్త పరచాలి...నువ్వు మాత్రం మన విషయాలెక్కడా బయటకి పొక్కనివ్వద్దు, ముఖ్యంగా రాయచూరులో నీ స్నేహితులకి. తెల్సిందా?" అని మసూంకి చెప్పాడు.

మసూం సరేనని చెప్పి, కొంత ధనం తీసుకొని రాయచూరు వెనక్కి బయల్దేరాడు. అహ్మద్‌ఖాన్ ఎలాగయినా దేవరాయలపై విజయాన్ని కోర్కుంటున్నాడు. మసూం కూడా అదే కావాలి. దేవరాయల వంశం తనకి చేసిన అన్యాయానికి ఎలాగయినా పగ తీర్చుకోవాలి. అందుకోసమే తను జీవిస్తున్నాడు. అది నెరవేరేవరకూ అతనికి ఉపశమనం లేదు.

0000000000000000000000

మర్నాడు ఉదయమే శంభుడు రాయచూరు బయల్దేరాడు. ఎక్కడికెళుతున్నదీ ఇంట్లో కూడా చెప్పలేదు. రెండు మూడు దినాలు పట్టచ్చనీ, ఆవలెళ్ళుండికల్లా వస్తాననీ తల్లి తండ్రులకి చెప్పి వెళ్ళాడు.

రాయచూరు చేరుకునేసరికి సాయంత్రమయ్యింది. తెలుసున్న స్నేహితుడింటికి వెళ్ళి అక్కడే ఉన్నాడు.

ముద్గల్లో ఏవో గొడవలు జరిగాయటకాదాని స్నేహితుడడిగాడు. పూర్తి వివరాలివ్వకుండా ఏదో చెప్పి తప్పించుకున్నాడు. మర్నాడు ఉదయం కోట బురుజు దగ్గరకెళ్ళాలనీ అక్కడ ఒక మిత్రుణ్ణి కలవాలనీ, అందుకే వచ్చాననీ చెప్పాడు. ప్రయాణ బడలికతో రాత్రి గాఢనిద్ర పట్టేసిందతనికి.

మర్నాడు ఉదయమే లేచి కోట బురుజు వద్దకొచ్చాడు. రేవన్నకానీ, ఎవరైనా కనిపిస్తారన్న ఆశ. మసూం తెలుసుకానీ అంతగా పరిచయం లేదు. క్రితంసారి నేహాలని తప్పించడం సందర్భంలోనే కలిసాడు. అంతకు మించి వివరాలు తెలీవు. చూడ్డానికి నల్లగా పొడవుగా ఉన్నా ముస్లింలా అనిపించలేదు. పేరువిని అతనెవరో తెలిసింది కానీ పైకి అడగలేదు. పైగా ఆనాడు ప్రశ్నలేసే సమయమూ లేదు.

మధ్యాన్నం వరకూ ఎక్కడా ఎవరూ కనిపించలేదు. ఎప్పటిలాగే కోటబురుజు వద్ద సందడిగా ఉంది. ఆకలి వేస్తే అక్కడేఉన్న సత్రంలోకి వెళ్ళి భోజనం చేసొచ్చాడు. సాయంత్రమయినా ఎక్కడా రేవన్న జాడలేదు. ఎవర్నయినా అడుగుదామంటే అక్కడెవరికీ రేవన్న తెలీదు. పైగా ఎక్కడో అజ్ఞాతంగా ఉండే వాళ్ళు తమ గురించి పదిమందికీ టముకేస్తారా? అనుకున్నాడు. రేపు కూడా చూసి కనిపించకపోతే తిరిగి ముద్గల్లు వెళిపోదామని నిశ్చయించుకున్నాడు. చీకటి పడుతూండగా ఇంటి ముఖం పట్టాడు. కాస్త కోట బురుజు దాటొచ్చాడో లేదో అతనికి ఒక వ్యక్తి వడివడిగా వెళుతూ కనిపించాడు. ఎవరాని దీర్ఘంగా చూస్తే అతనే మసూం అన్న అనుమానమొచ్చింది. దగ్గరికెళితే గుర్తుపట్టాడు. అతని ఆనందానికి అవధుల్లేవు.

ఎవరూ తమని గమనించడంలేదని రూఢి చేసుకొని మసూమ్ని పలకరించాడు. శంభుణ్ణి చూడగానే మసూం ఆశ్చర్యపోయాడు. ముద్గల్ విషయాలన్నీ చెప్పి, రేవన్న గురించడిగాడు.

"ఇక్కడ మనల్ని ఎవరైనా చూస్తారు. ఇంటికెళ్ళి మాట్లాడుకుందాం. నువ్వు నా వెనుకే రా!" అంటూ చెప్పి బయల్దేరాడు. శంభుడూ అతన్ని అనుసరించాడు.

ముందు మసూం ఇంటి లోపకి వెళ్ళాడు. శంభుణ్ణి దూరంగా ఒక చెట్టు దగ్గర ఆగిపొమ్మని చెప్పాడు. ఎవరూ చూడటం లేదని నిర్ధారించుకున్న తరువాత మెల్లగా రమ్మనమని చెయ్యి ఊపాడు. వేగంగా శంభుడు  ఇంటి లోపలకి ప్రవేశించాడు. అక్కడ రేవన్నా, నేహాలా, ఆమె తల్లితండ్రులూ శంభుణ్ణి చూసి ఇక్కడికెలా వచ్చాడాని ఆశ్చర్యపోయారు. మసూం వివరమంతా చెప్పాడు.

నేహాలని చూసి ఆరు వారాలు దాటింది. మొహంలో ఏదో తేడా కనిపించింది. హరీంద్ర, నేహాల తల్లీ ఆరువారాల్లోనే ఎంతో మార్పు కనిపించింది. కూతురికోసం బెంగ వాళ్ళ ముఖాల్లో స్పష్టంగా తెలుస్తోంది.

"మీకో అతి ముఖ్యమయినా వార్త చెప్పడానికొచ్చాను. వేదరాయశర్మ పోయారు." అంటూ మెల్లగా చెప్పాడు.

గురువుగారి మరణ వార్త విని నేహాలా, రేవన్నా స్థాణువుల్లా అయిపోయారు. శంభుడి మాటలు నమ్మ బుద్ధి కాలేదు వాళ్ళకి.

"ఏమయ్యింది? అసలాయన విజయనగరం నుండెప్పుడొచ్చారు? అనారోగ్యం చేసిందా?" ప్రశ్నల వర్షం కురిపించారందరూ.

జరిగినదంతా పూస గుచ్చినట్లు చెప్పాడు శంభుడు. నేహాల కళ్ళనీళ్ళ పర్యంతరమయ్యింది. మౌనంగా ప్రతీ మాటా వింటోంది.

"మీరనుకున్నట్లు అనారోగ్యం కాదు. మరలా విజయనగరం వెళ్ళి మహారాజుకి సర్ది చెబుదామనుకున్న తరుణంలో ఎవరో ఆయన్ని మార్గమధ్యంలో హత్య చేసారు. ఇది సైనికుల పనేనని ఊరంతా అనుకుంటున్నారు. రెండునాళ్ళ క్రితం సైనికాధికారి విజయనగరమెళ్ళి దేవరాయలవారికి నచ్చ చెప్పి సైన్యాన్ని వెనక్కి వచ్చేలా చేస్తాననీ చెప్పాడు. మీకీ విషం చెబుదామనే వచ్చాను. రేవన్నకానీ, మీరుకానీ ముద్గల్లు ఎక్కడ వస్తారో, ఏం చిక్కుల్లో పడతారోనన్న భయంతోనే వచ్చాను. రేవన్నా! నిన్న వచ్చేముందు మీ నాన్నగారిని కలిసాను. వారంతా క్షేమంగానే ఉన్నారు. మీరు ప్రస్తుతం ఇక్కడుండడమే క్షేమమని అన్నారు. నాకూ అలాగే తోస్తోంది." అని శంభుడు అన్నాడు.

"గురువుగార్ని ఎవరో హత్య చేసారా? నమ్మ బుద్ధి కావడం లేదు. అయినా ఆయనొక్కరూ విజయనగరం వెళ్ళరే? కూడా ఎవరూ వెళ్ళలేదా?" రేవన్నకి నమ్మబుద్ధి కావడం లేదు.

"నన్ను తోడు రమ్మనమని అడిగారు కానీ, మా వాళ్ళని వదిలి వెళ్ళడమిష్టంలేక వెళ్ళలేదు. అయినా సైన్యం మా అమ్మా, నాన్నలపై చేసిన ఊచకోత తలుచుకుంటేనే మనసు దహించుకుపోతోంది. మిగతా శిష్యులెవరూ వెళ్ళడానికి ముందుకు రాకపోడంతో గురువుగారొక్కరే బయల్దేరారు. ఇంతలో ఈ విషాదం జరిగిపోయింది." తలదించుకొని చెప్పాడు శంభుడు.

"ఏవిటో జరిగినవన్నీ తలచుకుంటే ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలీకుండా ఉంది. గురువుగారు చాలా మంచి వారు. అలాంటి వ్యక్తిని చంపడానికి మనసెలా వచ్చింది. గురువుగారి భార్య

ఎలావున్నారో? నాన్నా! ఒక్క సారి ముద్గల్ వెళ్ళి ఆవిణ్ణి చూసొద్దామా?" నేహాల తండ్రినడిగింది.

నేహాల మాటలు విని శంభుడు ఆశ్చర్యపోయాడు. ఒకరకంగా నేహాల జీవితాన్ని ఆయనే ఇలా మార్చాడు. అటువంటి వ్యక్తిని మంచివాడంటూ ప్రశంసించడం అతనికి చికాకు కలిగించింది. అదే పైకి అన్నాడు.

"ఎంతలేదన్నా మన గురువుగారు. ఆయన్ని చంపాడనికి చేతులెలా వచ్చాయి?  సైనికులకి నన్ను పట్టుకురమ్మనమనే చెప్పుంటారు కానీ, గురువుగార్ని చంపమనెవరు చెబుతారు? దేవరాయలు అనుజ్ఞిచ్చారని చెప్పినా నేను నమ్మను. నిష్కారణంగా ఆయన్ని చంపేసారు, గురువుగారు నన్ను రాణిగా చూడాలని అనుకున్నారు. అలాగే నేనూ నాకు నచ్చినట్లుగా ఉండాలనుకున్నాను. అంతెందుకు? గురువుగారి స్థానంలో ఎవరున్నా అలాగే చేస్తారు. ఇందులో ఆయన తప్పుందని నేననుకోను. మనందరికీ మంచి విద్యా బుద్ధులు నేర్పించారు. సంగీతమూ, నాట్యమూ నేర్పించారు. ఆయన లాంటి వ్యక్తి ఎక్కడా ఉండరు..." అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది నేహాల.

హరీంద్ర కూతుర్ని సముదాయించాడు. రేవన్నకేం మాట్లాడాలో తెలీలేదు. అందర్నీ వింటున్నాడంతే!

"రేవన్నా! ఏవయితే అయ్యింది మనం ముద్గల్ వెళిపోదాం! గురువుగారి భార్యనొకసారి చూసొద్దాం. నా మూలంగా ముద్గల్లుకి శాంతి లేకపోవడం భరించలేను.." ప్రాధేయపడింది.

"ఆవేశంలోనూ, బాధలోనూ అంటున్నావు కానీ, నువ్వెళితే విపత్పరిణామాలు ఇంకా ఎక్కువవుతాయి తప్ప తగ్గవు. నీకే ముప్పుకాదు. నీతో పాటు మీ అమ్మా, నాన్నకి కూడా. వాళ్ళకి కావల్సింది నువ్వు. నిన్ను తీసుకెళ్ళి, మీ తల్లితండ్రులకేదయినా హాని చేస్తే...? ఏం జరుగుతుందో చెప్పలేం.." రేవన్న నింపాదిగా చెప్పాడు.

"ఇప్పుడెళ్ళడం మంచిది కాదనీ నాకూ అనిపిస్తోంది. గుల్బర్గా సుల్తానులు విజయనగరంపై యుధ్ధానికి వస్తున్నారని విన్నాను. ఇటువంటప్పుడు వివాదాస్పదమయిన ఈ వూళ్ళో ఉండడమే శ్రేయస్కరం." మసూంణ తన మాటగా అన్నాడు.

"గుల్బర్గా సేల్తానులు యుద్ధానికెళుతున్నారా? మొన్ననే కదా యుద్ధం జరిగింది. ఏడాది కూడా కాలేదు..? అయినా ఈ విషయం నీకెలా తెలిసింది? " రేవన్న ఆశ్చర్యపోతూ అన్నాడు. మసూం విజయనగర రాజుల వద్ద వేగని రేవన్నకి తెలుసు.

"ఎవరో చెప్పగా విన్నాను. అయినా కొద్ది రోజులిక్కడుండమే మంచిది. మీకేమయినా ఇబ్బందిగా ఉంటే చెప్పండి!"

అతని మాటల్ని అడ్డుకుంటూ రేవన్నే మరలా అన్నాడు.

"చ! చ! అలాంటిదేం లేదు. నువ్వే లేకపోతే మేమందరమూ ఏమయ్యుండేవాళ్ళమో? మాకేమీ ఇబ్బంది లేదు. నిజం చెప్పద్దూ! ఇక్కడే మాకు ఏ గొడవా, బాధా లేకుండా వుంది."

మసూం గుల్బర్గా సుల్తానుల వద్ద కూడా వేగన్న విషయం అక్కడున్న ఎవరికీ తెలీదు. అతనూ ఎవరికీ చెప్పడు కూడా.

"రేవన్న చెప్పింది నిజం మసూం భయ్యా! నువ్వే లేకుంటే..ఊహించలేం కూడా..నీ మేలెప్పటికీ మరవలేము." నేహల కృతజ్ఞతా పూర్వకంగా అంది.

కొంతసేపు ముద్గల్లు ఊరి విషయాలు చర్చించుకున్నారు. తను వచ్చిన పనయ్యిందనీ, తననుండి ఏం సహాయం కావాలాన్నా చేస్తాననీ, మరో రెండువారాల తరువాతొస్తాననీ, మర్నాడు ముద్గల్లు తిరిగెళిపోతాననీ చెప్పాడు శంభుడు.

ఆ రాత్రి భోజనాలయ్యాక వీధి వసారాలో రేవన్నకీ, శంభుడికీ పక్క వేసారు. మసూం ఆ రాత్రికి వీధి అరుగుమీద పడుక్కుంటానని చెప్పాడు. నేహలా వాళ్ళూ ఎప్పటిలాగే లోపలి గదుల్లో పడుక్కున్నారు.

పడుక్కోబోయేముందు రేవన్నా, శంభుడూ కబుర్లలోకి దిగారు.

"శంభూ! నీ సహాయం ఎప్పటికీ మర్చిపోలేం. మేమిక్కడున్నట్లు ఎవరికీ చెప్పద్దు."

"అంత మాటెందుకు రేవన్నా! నేను మొదట్లో మిమ్మలందర్నీ ముఖ్యంగా నేహల్ని తప్పు అర్థం చేసుకున్నాను. నేహలలాంటి అమ్మాయినెక్కడా చూడం. గురువుగారి వల్లే తన జీవితం చెల్లా చెదురయ్యిందని తెలిసినా, ఆయన పోయారంటే అందరికంటే తనే ఎక్కువ బాధ పడడం ఆమెది ఎంత గొప్ప వ్యక్తిత్వమో తెలుస్తోంది. నిజంగా నువ్వు అదృష్టవంతుడివి రేవన్నా!"

"శంభూ! నిన్నొకటడుగుతాను. నిజం చెబుతావా?"

ఏవిటన్నట్లు చూసాడు శంభుడు. అడగమన్నట్లు తలూపాడు. బయట మసూం నిద్ర గురక స్పష్టంగా వినిపిస్తోంది. అటూ, ఇటూ ఎవరూ వినడం లేదని నిర్ధారించుకొని రేవన్నే అడిగాడు.

"గురువుగార్ని హత్య చేసింది నువ్వే కదూ?"

అతని ప్రశ్న విని అవాక్కాయ్యాడు శంభుడు. ఒక్కసారి అతని ముఖంలో రంగులు మారాయి. ఒక్క క్షణం ఏం మాట్లాడకుండా మౌనంగా ఉండి పోయాడు. రేవన్న అతని కళ్ళల్లో సూటిగా చూసాడు.

"నిజం చెప్పు..నువ్వే కదూ...?" రేవన్న రెట్టించాడు. అవునన్నట్లు తలూపాడు.

"గురువుగారి వల్లే నా తల్లితండ్రులు ఎన్నో దెబ్బలకి గురయ్యారు. మా అమ్మా,నాన్నని నా కళ్ళముందే చిత్రవధ చెయ్యడం భరించలేకపోయాను. గురువుగారి వల్లే ముద్గల్లుకి శని పట్టిందన్న ఆవేశంలో చంపేసాను. నాతోపాటు మనవూరివాళ్ళూ ఇద్దరున్నారు. - ఆయన్ని చంపడం కోసమే గురువుగారు విజయనగరం రమ్మనమన్నా వెళ్ళలేదు. తీరా అయానపోయాక ఊరంతా ఆయన శవం చూసి రోదిస్తు ఉంటే తట్టుకోలేక పోయాను. నే చేసిన పొరపాటు గ్రహించేలోపే అనర్థం జరిగిపోయింది..."

వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నాడు శంభుడు.

"ఎంత తప్పు చేసావు, శంభూ! తల్లీ, తండ్రీ, గురువూ అంటారు. తల్లి తండ్రులతరువాత అంతటి సమున్నత స్థానం మనిషి జీవితంలో ఎవరికీ దక్కదు. ఈ విషయమెవరికయినా తెలిస్తే నిన్నెవరూ ఒదిలిపెట్టరు.."

శంభుడు భయపడిపోయాడు.

"దయచేసి ఈ విషయం ఎవరికీ చెప్పదు. నాకు ప్రాణ భిక్ష పెట్టు..." ఏడుస్తూ అన్నాడు.

"ఎవరికీ చెప్పను. భయపడకు. జరిగిందేదో జరిగిపోయింది. నువ్వూ ఏవీ జరగనట్లే ఉండు.." రేవన్న శంభుడి చేతిలో చెయ్యి వేసి మాటిచ్చాడు.

కొంతసేపు వారిద్దరూ మౌనంగా లోచిస్తూ ఉండిపోయారు. అలా ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు.

ఆ మర్నాడు ముద్గల్లు తిరిగి ప్రయాణమయ్యాడు శంభుడు. రేవన్న కోట బురుజు వరకూ సాగనంపడానికొచ్చాడు.

"రేవన్నా! నిన్నొకటడగచ్చా? నేనే గురువుగార్ని చంపానన్న అనుమానం నీకెలా వచ్చింది?" దారిలో శంభుడు రేవన్నని అడిగాడు.

"ఎందుకో తెలీదు. నీకు జరిగినదంతా విని నువ్వే చేసుంటావన్న అనుమానమొచ్చిందంతే! నీకు జరిగినదానికి ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆవేశం ఎప్పుడూ నీ కళ్ళల్లో కనిపించేది. నేహల్ని ముద్గల్ నుండి తప్పించే రాత్రి నీ మాటల్లో క్రోధాన్ని గ్రహించాక నువ్వే చేసుండాలన్న అనుమానమొచ్చింది. అంతే!"

"ఈ విషయం ఎవరికీ..." జాలిగా మొహం పెట్టి అర్థించాడు శంభుడు.

"ఇహ నువ్వీ విషయం మర్చిపో!" అంటూ మరో సారి ప్రమాణం చేసి సాగనంపాడు రేవన్న.

0000000000000000

ముద్గల్ నుండి బయల్దేరిన సైనికాధికారి సరాసరి విజయనగరం వెళ్ళాడు. ముందస్తుగా మహారాజుని కలుద్దామని రాజమందిరానికి వెళితే, మహారాజు గత మూడు వారాలుగా ఆనెగొందిలో ఉంటున్నారన్న విషయం తెలిసింది. మొదటి భార్యా, పిల్లల్ని చూద్దామని వెళ్ళిన దేవరాయలకి సుస్తీ చేసి అక్కడే ఉండిపోయాడని చెప్పారు. అక్కడనుండే పరిపాలనా వ్యవహారాలు చూస్తున్నాడని తెలిసింది.

సైనికాధికారి వచ్చిన విషయం ఎలా తెలిసిందో నరేంద్ర గజపతి చెవిన పడింది. ఉన్నపళంగా సైనికాధికారిని రమ్మనమని కబురంపాడు. అతను ఎక్కడ ఆనెగొంది వెళ్ళి దేవరాయలకేం చెబుతాడోనన్న బెంగ. అసలే దేవరాయలు తన పేరు చెబితేనే అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాడు. మరలా ఈ సైనికాధికారి ఏం మోసుకొచ్చాడో? దేవరాయల్ని కలవడం ఒకరకంగా తనకి మరింత ముప్పు తెస్తుంది.

హుటాహుటిన ఆ సైనికాధికారిని వెనక్కి పిలిపించాడు. ముద్గల్ విషయాలు తెలుసుకున్నాడు. వేదరాయశర్మ మర్ణించాడన్న విషయం తెలిస్తే దేవరాయలు తనని బ్రతకనివ్వడు. తనే చంపించాడని నమ్ముతాడు. అలా జరిగితే తనకి ముప్పే!

అందుకే సైనికాధికారి ఇంటికివెళ్ళగా చూసి అతన్ని చంపేయమని తన ఆంతరంగికులకి పురమాయించాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ అతను ఈ విజయ నగరంలో ఉండకూడదు. నరేంద్ర గజపతి ఆదేశం ప్రకారం ఆ సైనికాధికారిని చంపి తుంగభద్ర నదీతీరంలో పడేశారు.

ఇదంతా రాత్రికి రాత్రి దగ్గరుండి జరిపించాడు నరేంద్రగజపతి. ఆంతరంగికుల మీద నమ్మకం తక్కువ. వాళ్ళు ఏదైనా పొరపాటున సైనికాధికారిని వదిలేస్తే అది తనకే చుట్టుకుంటుంది. అందుకే దగ్గరుండి నడిపించాడు. సైనికాధికారి మరణించాడన్న ధీమా కలిగాక చీకట్లో ఇంటి ముఖం పట్టాడు.

విజయనగరానికి పొంచిఉన్న ముప్పుకి సంకేతంగా దూరంగా ఒక తీతువు పిట్ట గట్టిగా అరుస్తోంది.

000000000000000000000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

Click here to share your comments on this serial